క్లుప్తంగా

ఘనంగా సుబ్రమణ్య షష్టి



కోయిల్‌కొండ: మండలంలోని అంకిళ్ళ గ్రామంలోని శివాలయంలో శనివారం సుబ్రమణ్యస్వామి షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారి రాఘవేందర్‌రావు తెలిపారు. స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనావాళి పూజలను జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు వెంకట్‌గౌడ్, గంగాధర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: అయ్యప్పకొండపై సుబ్రమణ్య షష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులతో పాటు ఆయా గ్రామాల భక్తులు ఉదయం4.30గంటల సమయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు రాజుగౌడ్, చెన్నయ్య, గోపాల్, బాల్‌రాజ్, గోవర్ధన్, నర్సింలు, శ్రీను, చెందు పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్‌లో గల శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌గా మన్నెం జనార్దన్‌రెడ్డి, సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, జంగయ్య, రాంచంద్రయ్యయాదవ్ ,రాఘవరెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, అలివేలు, సి.శ్రీను, వై.చెన్నయ్య, ఎం.శేఖర్, విశ్వప్రసాద్, శంకర్, మహేశ్ కుమార్, కేశవచారి ప్రమాణ స్వీకారంచేశారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణ, ఈఓ దీప్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

హన్వాడ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్ తెలిపారు. శనివారం మండలంలోని సల్లోనిపల్లి నుంచి పలుగుతండాకు వేసిన మట్టిరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణమే కాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, వంకమ్ యాదిరెడ్డి, చెన్నయ్య, శ్రీనివాస్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

మహమ్మదాబాద్: దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని ఎంఈఓ రాజునాయక్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని నెంబర్2 పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను తల్లిదండ్రులు ప్రేమాభిమానాలు చూపాలని కోరారు. సమాజంలో వారు తక్కువేమీ కాదనే ఆత్మవిశ్వాసాన్ని నింపాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి ఏర్పాటుచేసిన క్రీడాపోటీల్లో గెలుపొ ఒదిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, సీపీఎస్ నెంబర్2 హెచ్ఎం ఇందిర పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

మహమ్మదాబాద్: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాలు.. మండలంలోని నంచర్ల క్రాస్‌రోడ్డు దగ్గర మహబూబ్‌నగర్ చించోళీ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి తాండూరు వైపు వెళుతున్న తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లో నుండి బయలు దేరింది. అక్కడే రోడ్డుకు నీళ్లు పడుతున్న వాటర్ ట్యాంకర్ ఎదురుగా వస్తుం. ట్యాంకర్‌కు బ్రేకులు పడకపోవడంతో ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. బస్సు ముందు భాగంలో అద్దాలు పగిలాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది.

పండ్ల తోటలను సంరక్షించుకోవాలి

రాజాపూర్(బాలానగర్): పండ్లతోటలను రైతులు తోటలు రోగాలబారిన పడకుండా సస్యరక్షణచర్యలు తీసుకోవాలని క్లస్టర్ ఉద్యాన శాఖాధికారి మహేందర్ పేర్కొన్నారు. శనివారం బాలానగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామ రైతు శ్రీధర్‌గౌడ్ సాగుచేసుకున్న మామిడి, డ్రాగన్, నేరడు తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రతలను రైతులకు వివరించారు. కొత్తగా తోటలు సాగుచేసుకోవాలనుకున్న పండ్లతోటల రైతులు మొక్కల ఎంపికలో నాణ్యమైన మొక్కలను ఎంపిక చేసుకోవాలన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని జమిస్తాపూర్‌లో రూ.20 లక్షలతో ప్రాథమిక వైద్య కేంద్ర భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కోడూర్‌లో సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచిందని అన్నారు. వైద్య కేంద్రం కోసం స్థలం దానం చేసిన మన్నె పెద్ద వెంకట్రాములు కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారన్నారు. అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ కరుణశ్రీ, పీఆర్ ఏఈ రాములు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

కేజీబీవీ జూనియర్ కళాశాలకు భూమిపూజ

కోడూర్‌లో కస్తూర్బాగాంధీ విద్యాలయం జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే యెన్నం శంకుస్థాపన చేశారు. మంచి లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల వచ్చే సంవత్సరం పాలమూరు యూనివర్సిటీలో అందుబాటులోకి



కోడూర్‌లో కేజీబీవీ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

వస్తుందని తెలిపారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి సువర్ణ, ఎంపీడీఓ కరుణశ్రీ, ఎంపీఓ శంకర్‌నాయక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువుల్లో ఉన్నతంగా రాణించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బాలికలు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలు చదువుకుని వాళ్ల కాళ్ల మీద వారు నిలబడి ఎదిగేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కౌసర్‌జహన్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

సమీకృత విద్యాభవనానికి శంకుస్థాపన

జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో సమీకృత విద్యాభవనానికి ఎమ్మెల్యే యెన్నం శనివారం శంకుస్థాపన చేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ పాలమూరును ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, కౌన్సిలర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ముడా నిధులతో పార్కులకు శంకుస్థాపన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం అప్పన్నపల్లి (వార్డు నం.3)లోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రూ.38లక్షలతో, అయోధ్యనగర్ (వార్డు నం.10) లో రూ.30 లక్షల ముడా నిధులతో నిర్మించే రెండు పార్కులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మరికొన్ని చోట్ల అధునాతనమైన పార్కులను నిర్మిస్తామన్నారు. వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్లు రామాంజనేయులు, రాణి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి హోంగార్డుల పాలాభిషేకం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో పని చేస్తున్న హోంగార్డుల వేతనాలు ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో శనివారం జిల్లా పరేడ్ మైదానంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి హోంగార్డులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా హోంగార్డులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హోంగార్డుల రోజు వారి వేతనం రూ.921 నుంచి రూ.వెయ్యికి పెంచడం, వీక్లీ పరేడ్ అలవెన్స్ నెలకు రూ.వంద నుంచి రూ.200లకు పెంచినట్లు తెలిపారు. వీటితో పాటు ప్రమాదాల్లో కానీ విధుల్లో ఉండి సహజ మరణం పొందిన వారి హోంగార్డు కుటుంబానికి రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తారన్నారు.

మహాగర్జన విజయవంతం చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ కోరుతూ హైదరాబాద్‌లో జనవరి 19న నిర్వహించనున్న మాదిగల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య కోరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని అన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించిన తర్వాతనే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేష్, అధికార ప్రతినిధి కాలె నరేందర్, నాయకులు అంజయ్య, కాలె రమేష్, సీహెచ్ రాజు, బాలకిష్టయ్య, హన్మంతు, మొగులయ్య, రాజు, బలుసుపల్లి రాజు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేద్దాం

జడ్చర్ల టౌన్: ప్రాథమిక హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా ఈనెల 14న నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని పూలె, అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లోని క్రౌన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ప్రథమ మహాసభలకు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఐక్యవేదిక సభ్యులు ఉదయమిత్ర, బూర్గుపల్లి కృష్ణయాదవ్, భీంరాజ్, జహంగీర్ పాష, లింగంపేట శేఖర్, గోపాల్, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం రెండో వార్డు పరిధిలోని లక్ష్మీనగర్‌కాలనీలో పర్యటించారు. పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేని స్థానికులు వాపోయారు. స్పందించిన ఆయన త్వరలోనే వీటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడాపోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడాపోలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు గ్రామంలోని యువకులు క్రీడల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి, హజిలాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ బలరాం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న విధానాలపై, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వంట గది పాత్రలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలో నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మా నాన్న దిలీప్‌రెడ్డి అప్పట్లో కర్ణాటక రాష్ట్రంలో బాక్సింగ్, జావలిన్‌లో గోల్డ్‌మెడలిస్ట్ అని గుర్తు చేశారు. క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. నియోజకవర్గంలోని క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, మాజీసర్పంచ్ శశికళారెడ్డి. నాయకులు శ్రీనివాస్‌నాయక్, రాజాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, నాగయ్య, మంజుల, జానకమ్మ,రాధ, మాధవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డిగూడ గ్రామంలో సీఎం కప్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తదితరులు

కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, నాయకులు రబ్బానీ, సాయిలు, వెంకటయ్య, గౌస్, మల్లిఖార్జున్‌రెడ్డి, సంపత్, వెంకటేష్‌గౌడ్, రాము, జహంగీర్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం

మిడ్జిల్: ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మండలంలోని కొత్తపల్లి, బైరంపల్లి, దోనూర్, చిల్వేర్, వాడ్యాల్, మసిగొండ్లపల్లి, మిడ్జిల్, బోయిన్‌పల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో అన్నిపనులను దశలవారీగా పూర్తి చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యేకి స్వల్ప అస్వస్థత

జడ్చర్ల: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని గంగాపూర్ గ్రామంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ చేస్తున్న సమయంలో ఆయన ఎడమ చేతి గుంజడంతో పాటు ఛాతిలో అసౌకర్యంగా ఉండడంతో కొంత ఇబ్బంది పడ్డారు. కొద్దిసేపటికే చెమటలు పట్టడం, నీరసం అనిపించడంతో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షించిన వైద్యులు అంతా బాగానే ఉందని తెలిపారు. విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కొద్ది సేపు విరామం అనంతరం తిరిగి యథావిధిగా ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొనేందుకు మిడ్జిల్‌కు బయలుదేరి వెళ్లారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అర్హులైన 26మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉండేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతిఒక్క లబ్ధిదారుడు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్, మండల అధ్యక్షులు రవీందర్, బండి యాదవ్‌కుమార్, సత్యపాల్‌రెడ్డి, రవినాయక్ రాఘవేందర్‌రెడ్డి, మనోజ్, రామస్వామి, దస్తగిరి పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

అంగన్‌వాడీలను బలోపేతం చేస్తాం

దేవరకద్ర రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం చౌదరిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రీ ప్రైమరీ విద్యా బోధన చేపట్టనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లుకు దశలవారీగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించి ఇచ్చే బాధ్యతను డీఆర్‌డీఏ ద్వారా మహిళ శక్తి సంఘాలకు అప్పగించామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంజిల్ రెడ్డి, అర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చిన్నచింతకుంట: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నచింతకుంట మండలంలోని నెల్లికొండి, సీతారాంపేట, దమగ్నాపూరం గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నెల్లికొండి గ్రామంలో భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయల నిధులను ఖర్చుచేస్తూ గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నెల్లికొండ గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

దేవరకద్ర రూరల్: చిన్నరాజమూర్‌లోని శ్రీఆంజనేయస్వామి బ్రహ్మోత్సవానికి సంబంధించిన ఆహ్వానపత్రికను శనివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13నుంచి 17వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- డీఈఓ ప్రవీణ్‌కుమార్

గండేడ్: క్రీడలతో ఉజ్వల భవిషత్తు ఉంటుందని మహబూబ్‌నగర్ డీఈఓ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలల్లో సీఎం కప్ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన సీఎం కప్ క్రీడా పోటీలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆటలు ఆడారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వసతులు ఎలా ఉన్నాయో.. విద్యాభ్యాసం ఎలా కొనసాగుతుంది, మధ్యాహ్న భోజనం ఎలా ఉందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పీడీ ఆంజనేయులును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరకోల్లాసమే కాకుండా జీవిత లక్ష్యానికి కూడా తోడ్పడతాయన్నారు. చక్కటి క్రమశిక్షణ , సంస్కృతితో పాటు మంచి నడవడిని కూడా నేర్పుతుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆదిశగా ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. క్రీడలతో పాటు చదువు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం గండేడ్ మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ఏర్పాటుచేసే ప్రాంగణాన్ని వసతులను పరిశీలించారు. త్వరలో దీనిని ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓ జనార్దన్, ఎస్ఓ లక్ష్మీబాయి, మాజీ ఎంపీటీసీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



వెన్నాచేడ్‌లో పీడీ ఆంజనేయులును సన్మానిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలి

మహమ్మదాబాద్: విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో, సిబ్బందితో ఆయన మాట్లాడారు. సీఎం కప్ క్రీడల సందర్భంగా క్రీడల పట్ల విద్యార్థులు చూపుతున్న శ్రద్ధను ఉపాధ్యాయులు గమనించాలన్నారు. వారిని జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పాల్గొనే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓ రాజునాయక్, ప్రిన్సిపాల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఉత్సవాలు ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రిలో గల హజ్రత్ సయ్యద్‌షా జమాల్ హుస్సేని చిస్తీ, సయ్యద్ కమాల్ హుస్సేనీ చిస్తీ రహెమతుల్లా అలై దర్గా 649వ ఉత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. రాత్రి 7 గంటలకు గుసుల్‌షరీఫ్ (జలాభిషకం) నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఫాతేహాలు అందజేశారు. ఈ సందర్భంగా ముతవల్లీ షా మహ్మద్ ఫజల్‌ఖాన్ మాట్లాడుతూ వేడుకల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవం ఆదివారం నిర్వహిస్తారన్నారు. గంధోత్సవ ఊరేగింపు రామయ్యబౌళి నుంచి ప్రారంభమై అశోక్‌టాకీస్ చౌరస్తా, తిమ్మసానిపల్లి గేట్, దొడ్డలోనిపల్లి మీదుగా దర్గాకు తీసుకెళ్తారని అన్నారు. అనంతరం దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు చేస్తారని తెలిపారు.



పేద విద్యార్థులకు మేలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



పాలమూరు: మహబూబ్‌నగర్‌లో జిల్లాలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకు నవోదయ విద్యాలయం కేటాయించిన సందర్భంగా బీజేపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి శనివారం తెలంగాణ చౌరస్తాలో పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమలో బీజేపీ నాయకులు కొండయ్య, కృష్ణయ్య, జయశ్రీ, నిరంజనమ్మ, వేణమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

మౌంట్ బాసిల్‌లో ఆర్మీ జవాన్లకు సన్మానం





ఆర్మీజవాన్లను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సాయుధ దళాల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్లు హరీష్, రమేష్‌లను సన్మానించారు. మండలంలోని మౌంట్‌బాసిల్ పాఠశాల ఘనంగా సాయుధ దళాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మీలో పనిచేయడం అంటే దేశం కోసం సేవ చేయడమేనని అన్నారు. అలాంటి విధులు నిర్వహిస్తున్నందుకు గర్వంగా భావిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కూడా భావిభారత పౌరులుగా ఎదగాలంటే తప్పకుండా దేశం పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్ పూజితా మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

జడ్చర్ల టౌన్: విద్యాశాఖ సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఒప్పందం ఉద్యోగులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖలో కీలక భూమిక పోషిస్తున్న సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు సేవలు చాలా కీలకమన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

హన్వాడ/మహమ్మదాబాద్: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్, మహమ్మదాబాద్ మండల నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎలాంటి తరుగు లేకుండా క్వింటాల్‌కు ప్రభుత్వ ధర కాకుండా రూ.500బోనస్ ఇచ్చారన్నారు. హన్వాడకు చెందిన రైతు దస్తగిరికి రూ.65వేల లాభం, శ్రీనివాస్‌రెడ్డి రైతుకు రూ.లక్షకు పైగా లాభం వచ్చిందన్నారు. బోనస్‌తో రైతు కళ్లలో ఆనందం కనపడుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య, యాదిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గండేడ్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భోజనం చేశారు. ముందుగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన ఏజన్సీ వారితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు

‘ఇందిరమ్మ’ యాప్‌ను పరిశీలించిన పీడీ

నవాబుపేట: ఇందిరమ్మ యాప్‌ను శనివారం హౌసింగ్ పీడీ విద్యాం భాస్కర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని సిద్దోటం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ యాప్‌ను ఆయన పరిశీలించి పంచాయతీ అధికారులకు దాని పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికీ వస్తాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.ఎంపీడీఓ జయరాంనాయక్, బద్రునాయక్, పంచాయతీ అధికారులు నరేందర్, శివరెడ్డి తదితరులు ఉన్నారు.

కళాజాతా

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్, గొల్లపల్లి, నసరుల్లాబాద్ గ్రామాల్లో శనివారం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక సారథి కళా బృందం ఆధ్వర్యంలో రూ.500కే వంటగ్యాస్, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలపై అవగాహన కల్పించారు.